# మనసు - మమత

## శ్రీ పసుపులేటి సుబ్బయ్యబాబు

జీవితంలో రెండోసారి పెళ్ళిపీటలమీద కూర్చోడానికి ముస్తాబవుతోంది పద్మావతి. పద్మావతికి నిండా ఇరవై ఏళ్ళు లేవు. ఒక్కసారి చూసినవాళ్ళు పదేపదే పదిసార్లు చూసేలా చెయ్యగల అందం. ఈ అందమే ఈ రెండో పెళ్ళికొడుకుని కూడా వెదకి తెచ్చింది. "పద్మ బ్రతుకు ఇలా బండలు కావలసిందేనా, ఏమైనాసరే దానికి రెండోపెళ్ళి చేస్తాను" అని పద్మావతి అన్నయ్య పట్టుపట్టినప్పుడు, ఇక చేసేదిలేక వాళ్ళ ముసలిబామ్మ వదలిన ఆఖరు అస్త్రం "నువ్వు చేస్తావు సరే, మొగుడు చచ్చినదాన్ని పెళ్ళాడేవాడు దొరకద్దూ" అని. కాని ఈ అస్త్రం వాళ్ళ అన్నయ్య నేమీ బాధించలేదు. మూడోనాటి కల్లా కట్నం కూడా పనిలేదని మాధవరావు సిద్ధపడ్డాడు. మాధవరావు పద్మావతికి చదువుకునే రోజుల్నుండి తెలుసు. ఆ రోజుల్లో ఆమె అందానికి ముగ్ధులై ఆరాధించేవాళ్ళల్లో అత నొకడు. ఇన్నీ సమకూరాక ఇప్పుడు బామ్మ మరో అస్త్రం ప్రయోగించింది—'ఇంతకీ చేసుకోవాల్సింది అది, దాన్ని కనుక్కున్నావూ' అని. అన్నయ్య తన్ను అడిగితే పద్మావతి ఎటూ సమాధానం చెప్పలేకపోయింది. 'ఆయన' చనిపోయి రెండు సంవత్సరాలైంది. ఏ ఏడాదో, ఏడాదిన్నరో కాపురం చేసింది తను. ఆయన చనిపోయిన ఈ రెండేళ్ళనుండీ తనకేం ప్రత్యేకం వివాహవాంఛ కలుగలేదు. అయితే ఎప్పుడూ అట్లా ఇంట్లో పడిఉండటం ఏదో శూన్యంగా ఉన్నట్లుండేది. ఎన్నాళ్లిట్లా ? ఎందుకు బ్రతుకు ? అని అప్పుడప్పుడూ అనిపిస్తూ ఉండటం మటుకు ఉంది. ఎప్పుడైనా 'ఆయన' తలపుకు వచ్చి మనసు కలతకలతగా ఉండేది. ఇప్పుడు తీరా అన్నయ్య 'యిష్టమేమిటమ్మా' అంటే తన యిష్టమేమిటో తనకే తెలియనేలేదు. రెండో పెళ్ళన్నా, మాధవరావు పెళ్ళికొడుకన్నా యిష్టమూ కలగలేదు, అయిష్టమూ కలగలేదు. చివరికి అన్నయ్య మళ్ళీ రెట్టించి 'ఏమమ్మా' అన్నప్పుడు 'నీ యిష్టం అన్నయ్యా' అనేసింది తనకు తెలియకుండానే.

పెళ్ళి స్థిరపడింది. పెళ్ళి ఏర్పాట్లు జరిగిపోయాయి !

పద్మావతి పెళ్ళిపీటల మీదికి వెళ్లబోయేముందు మాధవరావు తరఫు వాళ్ళెవరూ పెళ్ళికి రాలేదన్న సంగతి తెలిసింది. ఆమె మనస్సు చివుక్కుమన్నది. అయితే మాధవరావు మిత్రుడు మూర్తి మాత్రం వచ్చాడు. వచ్చి అతను ఒక్కడూ చేస్తున్న హడావుడి చూసినవాళ్ళకి మగపెళ్ళి తరఫు బంధువులు రాలేదన్న సంగతే స్ఫురించదు. 'ముహూర్తం మించిపోతోంది. పెళ్ళికూతుర్ని తీసుకురండి' అంటూ అరుస్తున్నాడు మూర్తి పెళ్ళి పందిట్లోంచి. ఈ అరుపులు పద్మావతి వింటూనేఉంది. తన ముస్తాబు పూర్తయి కూడా చాలాసేపయింది. కాని తన దగ్గర్లోనో ఒకరిద్దరు ముత్తయిదువలైతే ఉన్నారు గానీ, వాళ్లల్లో ఎవరూ తన్ను పట్టుకు తీసుకు వెళ్ళే ప్రయత్నంలో లేరు. 'ఆయన'తో జరిగిన తన పెళ్ళి మెదలింది పద్మావతి మనసులో. అప్పుడు ఇద్దరు పెద్ద ముత్తయిదువలు తన్ను పొదివి పట్టుకుని, నడిపించుకుని వెళ్ళి పెళ్ళిపీటలమీద కూర్చోబెట్టారు. అప్పు డదంతా ఎంతో సహజ మనిపించింది తనకు. ఇప్పుడు మరి ఎట్లా జరగాలో, ఏమి చేయాలో—పద్మావతికి ఏమీ తోచడంలేదు. అవతల పందిట్లోంచి కేకలు. ఇవతల ఈ ముత్తయిదువల్ని తన్ను పట్టుకు నడిపించి తీసికెళ్లమని తనుగా ఎట్లా అడిగేట్లు ! ఇబ్బందిగా అటూ ఇటూ కదలి, చుట్టూ చూసింది. ఏమీ జరగలేదు. ఈ స్థితిలో ఉండగా పందిట్లోంచి మూర్తి గొంతుతోబాటు "అమ్మా, పద్మా" అన్న అన్నయ్య కంఠస్వరం కూడా విన్పించేసరికి, పద్మావతికి ఇక తప్పలేదు—భారంగా నిట్టూర్చి తనంతట తానే లేచి అడుగులో అడుగు వేస్తూ చిన్నగా నడచి వెళ్లింది పెళ్ళిపందిట్లోకి !

పెళ్ళిపీటలమీద కూర్చున్నదే గాని, అంతా తనవంకే విచిత్రంగా చూస్తున్నా రనిపించింది పద్మావతికి. పిరికి పిరికిగా నలుగురి ముఖాలు చూడ మొదలెట్టింది. ఈ చూడటమూ కొందరికి విడ్డూరంగా తోచవచ్చునన్న సంగతే తట్టలేదు ఆమెకి. కాని "కాస్త తలవంచుకు కూర్చోవే. అంత మరీ సిగ్గనేది లేదన్నట్లు అదేమిటి? అంతా గుసగుస లాడుకుంటారు. అందునా ...." అన్నమాట చెవి ప్రక్కనే విన్పించి ఉలిక్కిపడి ప్రక్కకి చూచింది— సుగుణ ! సుగుణ పద్మావతికి ఆప్తస్నేహితురాలు. సుగుణ మాటల్లో చివర వచ్చిన "అందునా ...." అన్నమాట ఆమెకు చురుక్కుమని తగిలింది. ఆపకుండా పూర్తిచేసివుంటే అదేమిటో ఆమెకు తెలుసు. పెళ్ళికూతురు ముస్తాబవుతూ తను ఇందాక జడకుచ్చులు వేసుకుంటానంటే ఈ సుగుణే "అదొక టెందుకు? అంతా గుసగుస లాడతారు. అందునా రెండోపెళ్ళి" అన్నది.

అసలు మొదట్నుంచి సుగుణ తత్వమే అంత. కాస్త వసపాలు హెచ్చు. తన నేస్తం పద్మావతిని ఇతర్లు విమర్శించరాదనే తాపత్రయమే ఎంతసేపూ ! ఈ తాపత్రయం పద్మావతిని అప్పుడప్పుడూ ఇబ్బందిపెడుతూ ఉంటుంది. ఇప్పుడు సుగుణ మాటతో ఆమెకు తన మొదటి పెళ్ళి దృశ్యం తటాలున కళ్లముందు వచ్చి నిల్చింది—అప్పుడూ తను ఇలాగే తలవంచుకు కూర్చోలేదు మొదట. తనకు వరసైనవాళ్లంతా సరసాలతో నవ్వుకున్నారు. "ఈ రోజుల్లో చదువుకున్న ఆడపిల్లలు, అమ్మో తలవంచుకు కూచోటమే. ఏమయ్యా

"తమ్ముడూ, మరి మీ ఆవిడచేత యెలా పంపిస్తావో'' అన్నది వదిన, ఆయన వెనకే నిలబడి నవ్వుతూ! అంతా ఫక్కున నవ్వారు. 'ఆయన' కొంటెగా తనవైపు చూసి చిన్నగా నవ్వారు. ఆ చూపులో, ఆ నవ్వులో తనకు యెక్కడలేని సిగ్గు ముంచుకువచ్చి చటుక్కున తల వంచేసుకుంది. అందరూ ఇంకా పగలబడి నవ్వారు. తన మనసు సిగ్గుతో, ఆనందంతో, ఏదో మధురానుభూతితో పులకలు తొడిగింది.

ఇప్పుడో ? సుగుణ వెనకనుంచి తన తలపై చేయి వేసినట్లే వేసి క్రిందికి అదిమింది. పద్మావతి తల యాంత్రికంగా క్రిందికి వంగి అలాగే ఉండిపోయింది.

ఇంత జరిగాక పద్మావతికి ఒకటే ఆలోచనలు పట్టుకున్నవి. ఈ 'రెండోపెళ్లి' అన్న ముద్ర తన ప్రతి చేష్టలోనూ, ప్రతి కదలికలోనూ ఎల్లకాలం ఉండిపోవలసిందేనా? అందరి దృష్టుల్లోనూ తను ఇలా విచిత్రంగా, ప్రత్యేకంగా ఎప్పటికి నిలబడిపోవలసిందేనా ? ఇవే ఆలోచనలు. ఉండి ఉండి ఆమెకు మరో భయం కూడా పట్టుకుంది, మాధవరావూ ఇంతేనేమోనని. తన అందం చూసి, తన్ను ఏరి కోరి చేసుకున్నాడు అతను. పెళ్లిపందిట్లో అతని ఆనందం చూస్తే రెండోపెళ్లి అయినా తను భార్యగా లభించటంపట్ల అమిత సంబరపడిపోతున్నట్లున్నాడు. ఈ మోజు తీరిపోగానే అందరిలాగే అతనూ తన్ను చిన్నచూపు చూడడుగదా ! ఇవే ఆలోచనలు—ఆ రోజంతా పద్మావతికి.

ఆ రాత్రే శోభనం.

క్రొత్త అందాలతో, అలంకారాలతో, దేవకన్యలా మెరిసిపోతున్న పద్మావతి మెలమెల్లగా అడుగులు వేసుకుంటూ వెళ్లి శోభనం గదిలో నిలబడింది. క్రిందికి దించిన ఆమె కళ్లకు పాన్పుపై కూర్చున్న మాధవరావు పాదాలు కన్పిస్తున్నాయి, తెల్లగా, అందంగా ! కాస్త కళ్లు పైకెత్తింది. పట్టుదుస్తుల్లో—అంతకుమించి కాంతు లీనుతున్న కళ్లతో—మత్తుగా పద్మావతి వంకే చూస్తూ మనోహరంగా ఉన్నాడు మాధవరావు. మాధవరావు రూపం, వీక్షణాలు—శోభనపు గది అంతా నిండిన అగరు వాసన, మల్లెలతో ఘుమఘుమ లాడుతోన్న తెల్లని పాన్పు, తన తలలో కిలకిల మంటోన్న పువ్వుల నవ్వులు—అన్నీ కలసి ఆమె శరీరానికి పులకలు తొడిగి గిలిగింతలు పెట్టాయి.

'పద్మా' మాధవరావు కంఠం, మధురమైన సంగీత ధ్వని అందులో—

'. . . . . . . . .'

'పద్మా' ఎంత ప్రేమ అందులో—

'. . . . . . . .'

'ఇలారా పద్మా!'

పద్మావతి కదల్లేదు. మాధవరావే కదిలాడు. చిన్నగా లేచివచ్చి పద్మావతి గడ్డం సున్నితంగా మునివేళ్లతో పైకెత్తి ఆమె ముఖంవంక నిశ్చలంగా అలాగే చూస్తూ నిలబడ్డాడు. ఇట్లా మాధవరావు చూడటం ఆమెను సిగ్గుదొంతరలలో ముంచివేసింది. కళ్లు రెండూ మూసుకుని సిగ్గుతో తప్పించుకోబోయింది. ఆమె చెక్కిళ్లలో గులాబీలు విరిశాయి. పెదాల చివర విచ్చీ విచ్చని మొగ్గలాంటి మందహాసం ఒకటి దోబూచులాడుతోంది. మాధవరావు గాఢంగా పద్మావతిని రెండుచేతుల్లోనూ పొదువుకుని చెక్కిళ్లు నిమురుతూ ముఖం తన వేపుగా త్రిప్పుకోబోయాడు. ఆమె మనస్సులో అమృతం చిలికింది. శరీరం మధురమైన అనుభూతితో పరవశం చెందింది—ఈ మధురిమతోపాటు స్త్రీ సహజమైన సిగ్గు ముంచుకువచ్చింది—ముఖం తనవైపు త్రిప్పుకుని కళ్లల్లో కళ్లుంచబోతున్న మాధవరావు చేతుల్నుంచి మొఖాన్ని తప్పించుకుని అతని గుండెల్లో దాచేసుకుంది సిగ్గుతో—

మాధవరావు మృదువుగా తనలో తనే నవ్వుకుంటున్నట్లు 'నీకూ ఇంత సిగ్గయితే ఎట్లా' అన్నాడు.

ఈ మాటతో అంత మధురిమలోనూ పద్మావతి గుండె ఒక్కసారి ఆగి మళ్లీ కొట్టుకొంది. 'రెండో పెళ్లిదానివి నీకూ ఇంత సిగ్గయితే ఎట్లా' అన్నట్లుగానే విన్పించింది ఆమాట. ఇక ఎన్ని విధాల సరిపెట్టుకోవాలన్నా ఆమె మనసు కుదుటపడనేలేదు. 'ఇంతేనా—ఈయనా ఇంతేనా'—ఇవే తలపులు. ఈ తలపులవల్ల రేగే అనుమానాలు ఒకవైపు—మాధవరావు హృదయంలో పొంగి పొరలుతున్న ప్రేమామృతం ఒకవైపు—ఈ రెంటి మధ్యా ఆనంద సంశయాలతో గడిచిపోయింది ఆమెకు ఆ రాత్రి !

మర్నాటి ఉదయమే తన్ను హేళన చెయ్యటానికి పెరట్లో కాచుకు కూర్చున్న సుగుణ కన్పించింది మొదటగా. సుగుణ తీరు చూసేసరికి ఆమెకు నవ్వు వచ్చింది. 'సుగుణ మరీ ఇంత కొంటెదేం' అనుకుంది. వస్తున్న నవ్వును దాచుకుంటూ పెరట్లోకి వెళ్లి ఏమీ తెలియనట్లు మొఖం కడుగుకో కూర్చుంది గానీ సుగుణ ఎందుకు వదుల్తుంది ! శోభనపు రాత్రి తర్వాత పద్మావతిని ఏడ్పించటం, ఆ ఏడ్పించటంలో నవ్వించటం, నవ్వటం ఎందుకు వదులుకుంటుంది ! ఉండి ఉండి పద్మావతి ఇక తట్టుకోలేక ''ఎందుకులేవే తొందర! నీకూ కాబోతూ ఉందిగా పెళ్లి, అప్పుడు చెబుతాను నీపని' అన్నది నవ్వుతూ. సుగుణ తక్కువదేమీ కాదు.

''ఆఁ—నువ్వు ఎప్పుడూ ఇట్లాగే అంటావు. పోయిన సారీ ఇంతే అంటివి. ఆ పెళ్లేమో, నాకు కాకనే పోయె—నీవేమో ఒకటికి రెండు చూస్తూ చూస్తూండగానే చేసేసుకుంటివి.'' అన్నది విరగబడి నవ్వుతూ.

వెనుకనుంచి బామ్మ స్వరం విన్పించింది.

''పెళ్లికాని పిల్లవు, ఏమిటే ఆ విరగబాటూ నువ్వూ! ఆడదానికి నవ్వు నాలుగు విధాల చేటు.'' తను అన్న మాటలు ఈవిడ ఎక్కడ విన్నదో అని సుగుణ అక్కడినుండి తుర్రుమంది.

ఆ మాటలు బామ్మ వినలేదు. విన్న పద్మావతి మాత్రం అలాగే స్తబ్ధురాలై, నిశ్చేష్టితయై, సుగుణ పారిపోయిన

వైపుకే కళ్లప్పగించి చూస్తూ ఉండిపోయింది. చివరకు వాళ్ల బామ్మ వచ్చి "ఒసే పద్మా! ఎంతసేపూ ఆ మొఖం కడగటం —మీ ఆయన పిలుస్తున్నాడు ఫో" అని చెప్పేవరకూ కదలిక రాలేదు. అప్పుడు త్వరత్వరగా మొఖం కడుగుకుదిని హాల్లోకి వెళ్లబోతే మళ్లీ బామ్మ అడ్డుపడింది. "ఏమిటా పోవటం— బొట్టు పెట్టుకోకుండా .... హయ్యో ...."

పద్మావతి తప్పు తెలుసుకుని నాలుక్కరుచుకుంది. గత రెండేళ్లనుంచీ బొట్టు పెట్టుకునే అలవాటు తప్పిపోయింది— ఇప్పు డేమిటో 'బొట్టు' అంటే క్రొత్తగా కూడా ఉంది.

బొట్టు పెట్టుకుని, అలాగే చీర మార్చుకుని హాల్లోకి వచ్చేసరికి మాధవరావూ, మూర్తీ కూర్చుని ఉన్నారు. పద్మను చూడగానే మాధవరావు మొఖంలోకి వెలుగూ, కళ్లల్లోకి కాంతీ వచ్చాయి. పెదవుల చివర చిరునవ్వు చిమ్మింది. పద్మ సిగ్గుగా చూసింది అతనివంక— 'ఈయనికి ఎంత ఆపేక్ష' అనుకుంది. 'నేను అదృష్టవంతురాల్ని' అని కూడా అనుకుంది—అయినా అందరిముందూ అలా అదేపనిగా చూడ్డం సిగ్గనిపించింది.

మూర్తి వూరికి వెళ్తుంటే చెప్పటానికని పద్మావతికి పిలుపు వచ్చింది. అయితే మూర్తి శలవు తీసుకుంటూ చెప్పిన మాటలు ఆమెను కాస్త విస్మయపరిచాయి. "చూడమ్మా, ఒక్కమాట చెప్పాలనుకుంటున్నాను. మాధవ పసివాడికంటే అన్యాయం. వీడి మంచి చెడ్డల భారమంతా ఇక నీదే ...... ఇంతకంటె చదువుకున్నదానివి, విజ్ఞానవంతురాలివి నీకు చెప్పాల్సిందేముంది" ఇవీ అతను అన్న మాటలు. పద్మావతి విస్మయపడుతూ తనలో తను అనుకుంది—'ఇదేమిటి, ఈ అప్ప గింత. ఎవరైనా ఆడపిల్లను పెళ్లికొడుక్కు అప్పగిస్తారు .... అప్పటికి తనేమో ఆయనకంటే పెద్దదీ, అనుభవశాలీ అయి నట్టు ....'

మూర్తి వెళ్లిపోయాక మాధవరావుకు గదిలో కాఫీ అందిస్తూ మెల్లగా అడిగింది పద్మావతి.

"ఎవరండీ ఆయన."

"ఎవరు, మూర్తా .... నాకు చాలా దగ్గర స్నేహి తుడు. నేనంటే ప్రాణం వాడికి."

కాస్సేపు వూరుకుని వేలు నేల రాస్తూ మళ్లీ అన్నది!

"ఆయన అలా అంటారేమిటి, అప్పగింతలు పెడు తున్నట్టు."

మాధవరావు విశాలంగా నవ్వాడు. తర్వాత పద్మావతిని దగ్గరకు తీసుకుని "వాడి ఉద్దేశం—ఇక నువ్వు తప్ప నా కింకెవ వరూ లేరని, తెలిసిందా" అన్నాడు.

పద్మావతి ఏమీ పలకలేదు. మౌనంగా ఉండిపోయింది. మాధవరావే మళ్లీ అన్నాడు. "ఇక మా అమ్మా, నాన్నా వాళ్లు ఎవ్వరూ నన్ను పట్టించుకోరుగా. అదీ వాడి బాధ."

"ఎందుకని" అన్నది పద్మావతి. అని గతుక్కుమంది. ఎందుకనో తనకూ తెలుసు.

"ఎందుకేమిటి ? మన పెళ్లివాళ్లకి యిష్టంలేదు."

ఈ యిష్టం లేకపోయిన విషయం ఆమెకు ఇదివరకే తెలుసు. అందుకనే మరేమీ మాట్లాడలేదు. మాధవరావే మళ్లీ అన్నాడు—"అమాటకొస్తే మూర్తికీ యిష్టంలేదు. అయినా వాళ్లు పట్టించుకోకుండా పరాయివాళ్లలాగ, నామీద పగపూని ఉండిపోయారు. వీడేమో పెళ్లి పెత్తనమంతా నెత్తిన వేసు కుని అయిందనిపించాడు. అదీ తేడా."

మూర్తికి కూడా యిష్టం లేదన్నమాట పద్మావతికి కొంత ఆశ్చర్యాన్నే కలిగించింది.

"ఆయన కెందుకని యిష్టంలేదు" అన్నది తల వంచుకునే.

"వాడంతా ఏవో సిద్ధాంతాలు చెబుతాడులే. అదంతా వో చాదస్తం". పద్మావతి ఒక్క క్షణం ఆగి "మరి .... మరి .... మీకు పూర్తిగా యిష్టమేగదా" అన్నది. తనకు తెలియక కాదు. అయినా ఎందుకో ఆ ప్రశ్న తెలియకుండానే వచ్చేసింది.

మాధవరావు సమాధానం చెప్పలేదు. చిరునవ్వుతో పద్మావతి వైపు చూసి, ఆమె నడుంచుట్టూ చేతులువేసి దగ్గరకు లాక్కుని, ఎర్రని దొండపండులాంటి అధరాలను అమిత ఆపేక్షతో ముద్దిడుకొన్నాడు—అదే సమాధానం అన్నట్టు!

పద్మావతి పరవశ అయింది. ఆనందంతో, మైమర పుతో కళ్లు రెండూ మూతలు పడ్డాయి. "ఎవరికి యిష్టం లేకపోతే నాకేం—నేను అదృష్టవంతురాల్ని. నాకీ ప్రేమ లభ్య మైంది." అనుకుంది.

## 2

పద్మావతీ మాధవరావుల సంసారం, పెట్టినప్పటి నుండీ సాఫీగానే సాగిపోతున్న దనవచ్చు. కాకపోతే ఈ నాలు గేళ్లనుంచీ మాధవరావు తల్లిదండ్రులు మాటవరసకైనా తొంగిచూడలేదు. పద్మావతికి తన అత్తా మామలు ఎలా ఉంటారో కూడా తెలీదు. ఎవరైనా ఆమెవద్ద 'మీ అత్తగారు' అనీ 'మీ మామగారు' అనీ ప్రస్తావనగా అంటే తటాలున ఆమెకు మొదటిభర్త తల్లీ దండ్రీ స్ఫురించేవారు. వారితో తను ఒకటిన్నర సంవత్సరం కోడరికం చేసింది. తన్ను ఎంతో దయగా చూశారు వాళ్లు. 'ఆయన, కూడా తన్ను పువ్వుల్లో పెట్టుకు పూజించేవాడు. 'ఆయన' ఎప్పుడన్నా తన్ను మంద లించినా వాళ్లు వూరుకునేవాళ్లు కాదు. చివరికి తన యీ రెండోపెళ్లి సంగతి వాళ్లకి తెలిసి "కొడుకుతోపాటు కోడలు కూడా ఆనాడే చచ్చిం దనుకుంటాం—ఇంకా ఆవిడ మా కోడ లేమిటి ?" అన్నారని విన్నప్పుడు పద్మావతి బాధపడకుండా ఉండలేకపోయింది. కళ్లు చెమ్మగిల్లాయి గూడా! ఎందుకో తన స్థానం ఆ ముసలి దంపతుల వద్దనే అనీ, 'ఆయన' స్థానంలో వాళ్లకి సేవ చెయ్యటమే తన విధ్యుక్త ధర్మమనీ ఇప్పటికీ పద్మావతికి అప్పుడప్పుడూ అనిపిస్తూ ఉంటుంది—

ఇటువంటి ఆలోచనలు వచ్చినప్పుడు ఆమె కలతపడి పోతుంది!

ఆ కలత చూసి మాధవరావు కంగారుపడి పోతాడు!! బిక్కమొఖంవేసి పద్మావతి కొంగు వెంటనే తిరుగుతూ "ఏం

పద్మా ! అలా ఉన్నావు, నాతో చెప్పవూ'' అంటాడు పసివాడు అడిగినట్లు.

''ఏమీ లేదండీ, బాగానే ఉన్నానే'' అంటుంది తను. ''అదుగో దాస్తున్నావు. చెప్పకపోతే నామీద ఒట్టే'' అంటాడు అతను. ఈ నిర్మల పసి హృదయం చూసి పద్మావతి చలించిపోతుంది. తనపై వర్షిస్తోన్న యీ ప్రేమవాహినికి కన్నులు చెమ్మగిలగా మాధవరావుని దగ్గరకు తీసుకుని ''ఎందుకండీ అంతమాట. ఎందుకంత బాధపడతారు. మీరుండగా నాకేం కొరవ'' అంటుంది. మాధవరావు సమాధానం యివ్వడు. ఆమె కళ్లల్లోకి చూస్తూ అలాగే ఉండిపోతాడు. పద్మావతి అనుకుంటుంది—''ఈయన పొందవలసిన సుఖమంతా నావల్ల పొందలేక పోతున్నారేమో. పాపిష్ఠిదాన్ని, నా ఆలోచనలతో ఈయన సంగతే మరుస్తున్నాను. నన్నుగాక మరొకర్ని చేసుకునిఉంటే ఈ గొడవలేం లేక హాయిగా ఉండిపోయేవారుకదా.''

ఇట్లా సాగిపోతున్నాయి రోజులు ! ! !

ఆరోజు ఇలాగే అవీ ఇవీ ఆలోచిస్తూ కలతగా గదిలో పడుకుని ఉంది పద్మావతి. మాధవరావు ఆఫీసుకు వెళ్లిన దగ్గర్నుంచీ తనకేమీ తోచదు. పనిమనిషి వెంకటమ్మ ఉదయమే వచ్చి పనిచేసుకుని వెళ్లిపోతుంది. మళ్లా మధ్యాహ్నం పొద్దువాలాక గానీ రాదు. ఈలోగా అంతా ఒంటరితనమే. ఇంట్లో తాండవిస్తోన్న నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ బద్ధకంగా ఆవులించి ప్రక్కకు ఒత్తిగిలింది పద్మావతి.—ఆమె మొదటి భర్తతో సంసారం పెట్టిన రోజులు గుర్తుకు వచ్చాయి. అప్పట్లో బంధువుల రాకలూ, పోకలూ, సరసాలూ, విరసాలూ. అదోరకమైన సంబరంతో ఇల్లంతా కలకలలాడుతూ ఉండేది. ఇప్పుడు వెలివేసినట్టుగా ఎవ్వరూ రావటంలేదు. ఎప్పుడన్నా అన్నయ్య వచ్చి చూచి పోతుంటాడు. అప్పుడప్పుడూ మూర్తి వస్తూంటాడు. అంతే ! సుగుణ కూడా ఎన్నడూ రాలేదు. దాని బ్రతుకూ దేవుడు బండలు చేశాడు. తనకూ, మాధవరావుకూ పెళ్లయిన మూడోనెలలోనే సుగుణకూ పెళ్లయింది. ఆ పెళ్లిలోనే తన సుగుణను ప్రకితం సారిగా చూడటం. శోభనం అయిన మర్నాడు తను సుగుణను ఏడ్పించింది కూడా—పిచ్చిపిల్ల, వంచిన మొఖం ఎత్తనేలేదు, ఆరోజంతా. ఏమైతేనేం దాని పసుపు కుంకాన్ని దేవుడు రెండు కళ్లా చూడలేకపోయాడు. రెండేళ్లు కాపురం వెలగబెట్టిందో లేదో—విధవై పుట్టింటికి జేరింది. ఆవార్త విన్న రోజున తనకు తెల్లవార్లూ ఎంత ఆపుకుందామన్నా దుఃఖం ఆగలేదు. తన మొదటి భర్త చనిపోయిన దృశ్యమే కళ్లకు కట్టినట్టయి ఆ రాత్రంతా వెక్కిళ్లుపెట్టి ఏడ్చింది—ఆనాడు 'ఈయన' ఇంట్లో లేరు కాబట్టి సరిపోయింది—లేకుంటే ఎంత బాధపడుదురో !

సుగుణ బ్రతుకు ఇట్లా తెల్లవారాక తను దాన్ని చూడనేలేదు. ఏదీ, ఎన్నిసార్లు తాను వెళ్దామన్నా, దాన్ని పిలిపించుకుందామన్నా పడితేగా—

వరండాలో వెంకటమ్మ గొంతు విన్పించింది. సాయంకాలం పనికోసం వచ్చింది. పని వదిలి పక్కింటి పనిమనిషితో మాట్లాడుతున్నట్టుంది. ఆలోచనలలో బరువుతో మనసు భారంగా ఉండి పద్మావతి అలాగే పడుకుంది. అయితే వాళ్ల మాటల్లో 'సుగుణ' అన్నమాట వినిపించినట్లయి దృష్టి అటు మళ్లించింది. ఆమాట 'సుగుణ' కాదు, 'రమణ'. తనకి అట్లా విన్పించింది. రమణ పద్మావతికి తెలుసు. ఎదురింట్లోనే పనిచేస్తూ ఉండేది. దాని మొగుడూ, అదీ చిలకా గోరింకల్లా ఉండేవారు. వాడికేదో ఫ్యాక్టరీలో పని. ఆ పనిలోనే ఏదో మిషనులో యిరుక్కుని వాడి కాళ్లు రెండూ పోయాయి. ఇప్పటికి మూడేళ్ల పైమాట అది. ఈ మూడేళ్లనుండీ రమణ వాణ్ణి భరిస్తూ, నాలుగిళ్లు చేసుకుని వాణ్ణి పోషిస్తోంది. రమణ ఎంత అందమైందని ! దాని అందం, పొంకం, ఆడదైన పద్మావతికే కన్ను చెదరేది ఒక్కోసారి. ఈ మూడేళ్లనుండీ అటువంటి రమణ తల్లో పూలు పెట్టుకోగా గానీ, మంచి చీర సింగారించుకోగా గానీ చూసినవాళ్లు లేరు ......

మూడు రోజులైంది దాని మొగుడు చచ్చిపోయి .... !

. . . . . . . . . . . .

వరండాలో వెంకటమ్మా వాళ్లు మాట్లాడుకోవటం ఆ విషయమే. పద్మావతికి కొంతకొంతగా విన్పిస్తూవుంటే చిన్నగా లేచి గుమ్మంవైపు అడుగు వేసింది.

''అది ఈ రోజుల్లో పుట్టాల్సింది కాదనుకో'' అంటోంది వెంకటమ్మ.

''అయ్యోరాత ! ఈ రోజుల్లో జావకాచి పోస్తారా వాడి మొఖాన ఆ స్తితిలో.''

''జావ కాయడం దాకా పోయావు. ఎవడినో తీసుకుని జెండా పీకకుండా ఉంటే నయమే.''

''మొగుడు చచ్చాక మాత్రం ! దానిలాగ మొగుడికోసం పడి చచ్చేదాన్ని యెక్కడ చూస్తామే ఈ రోజుల్లో .... అట్లా తెంపిపొయ్యటం—ఇట్లా మూడు ముళ్లా వేయించుకోవటం.... హయ్యోరాత, ఎంతమందిని చూడటంలా.''

''నువ్వేమేనా అనవే, ఇది గొప్పోళ్లలోనే ఎక్కువ.''

''మనసుకు గొప్పా, సిన్నా ఏమిటే .... ఆడదన్నాక ఉండినా, చచ్చినా ఒకడే గాని ....''

ఎక్కడో ప్రారంభమై ఎక్కడికో వచ్చిన ఈ సంభాషణ చూసి విస్తుపోయింది పద్మావతి. తరతరాలుగా భారత నారిలో నూరిపోసిన సంస్కృతి ఫలితమే ఈ చివరి మాటలు. ఈ సంస్కృతి పద్మావతికీ సుపరిచితమైందే. అయినా ఆ చివరి మాటలు వచ్చి ములుకుల్లా తగిలాయి, ఆమెకు.

సంభాషణాధోరణి తప్పించాలనే తలపుతో లేని కుతూహలం తెచ్చుకుని పద్మావతి అన్నది : ''ఏమిటి వెంకటమ్మా, రమణ సంగతి ఏదో అంటున్నావు.''

''ఇంకా ఎక్కడి రమణ అమ్మగారూ ! దాని మొగుడు మూన్నాళ్ల కిందట పోయాడుగా ! నిన్న నంతా 'ఆయనే లేంది నేను మాత్రం యెందుకు—ఆయనే పోయాక నాకేం కావాలి, నేనూ పోతా' అంటావుంటే ఆ దుఃఖంలో అట్లా అంటా

ఉంది అనుకున్నాం అందరమూ ...... ఇవాళ ప్రొద్దుట చూసేసరికి చెరువులో పడి—చచ్చివుంది.''

నిశ్చేష్టురాలై నిలబడిపోయింది పద్మావతి. ఆమె మనసులో, మెదడులో సప్త సముద్రాలూ సుళ్లు తిరుగుతున్నట్టనిపించింది. కాళ్లక్రింద భూమి కదిలి దొలుచుకుపోతున్నట్టయింది. ఒక్కసారి ఒళ్లు జలదరించినట్టయి, తనకు తెలీకుండానే తన్ను రమణతో పోల్చుకుంటున్నట్టు నిలబడ్డ పట్టు తప్పిపోతున్నట్లు అన్పించింది—మాధవరావు వెనుకనుంచి వచ్చి పట్టుకోకపోయి ఉన్నట్టయితే బహుశా క్రింద పడిపోయి ఉండేదేమో కూడా.

''ఏమిటిది పద్మా, కాస్తయితే క్రింద పడిపోయేదానివి. అందులోనూ ఒట్టి మనిషివి కూడా కాదు.'' అన్నాడు మాధవరావు ఆమెను పొదివి పట్టుకుని, ఎంతో కంగారుగా.

మాధవరావు కంగారూ, ఆపేక్ష చూసి ఆమె మనస్సు ద్రవించిపోయింది. మాధవరావు అలాగే పొదువుకుని తన్ను లోనికి తీసికెళ్తూంటే ఆపేక్షగా అతని వంక చూసి అన్నది. ''నా కొచ్చిన ఫర్వా ఏమీలేదు. ప్రతి చిన్నదానికీ ఎందుకంత గాభరా పడతారు ?''

''అన్నీ చిన్నవిగానే కన్పిస్తాయి నీకు .... అందులోనూ ఒట్టి ......''

''చాలు చాల్లెండి, ఎన్నిసార్లు గుర్తుచేస్తారు'' అన్నది. అతన్ని కళ్లతో వారిస్తూ, చిన్నగా నవ్వుతూ. పద్మావతి కిప్పుడు ఆరోనెల ! ఇన్నాళ్లకి తొలి చూలు ! !

''చూడు పద్మా, ఇప్పుడు నీకో శుభవార్త చెబుదామని వచ్చాను, మరి ఏమిస్తావు చెప్పు.''

''మీకు నేను యివ్వలేనిది ఏమి ఉంది ? అయినా ఇవ్వగలిగింది మాత్రం ఏముంది? మీ దయకూ, ప్రేమకూ, విశాల హృదయానికీ ఏమిస్తే మాత్రం ఏం లెఖ్క.''

ఈమధ్య ఈ ధోరణి పద్మావతిలో హెచ్చుగా కన్పిస్తోంది. మొదట్లో మాధవరావు పట్ల కలిగిన భయ సందేహాలు సంసారం పెట్టిన తొలి రోజుల్లోనే చెరిగిపోయాయి, కాగా మాధవరావు తనపట్ల చూపుతున్న నిశ్చల ప్రేమకు, ఆపేక్షకు, ఆమె హృదయం కృతజ్ఞతాభావంతో నిండి అతని పాదాలపైన వాలిపోవాలనిపిస్తోంది.

''ఇదుగో, పద్మా—ఇలాంటి మాటలు వద్దని ఎన్నిసార్లు చెప్పాను. ఏదో కృతజ్ఞతాపూర్వకంగా నువ్వు మాట్లాడటం నేను భరించలేను.'' అన్నాడు మాధవరావు కళ్లలో అలక చూపిస్తూ.

''సరే పోనివ్వండి, ఏమిటా శుభవార్త.''

''సుగుణ వస్తోంది—రేపు ఉదయం.''

పద్మావతి ఎగిరి గంతేసింది. ''నిజంగానా'' అన్నది నమ్మలేనట్లు. కాని ఆ మర్నాటి ఉదయం నిజంగానే సుగుణ దిగినప్పుడు—ఆ రూపంలో సుగుణను చూసి—పద్మావతి ఆనందం కంటే విచారమే ఎక్కువగా పొందింది.

సుగుణ చాలా చిక్కిపోయిఉంది. మొఖంలో విచారం, నిరాశా గూడు కట్టుకుని ఉన్నాయి. శోకదేవతే రూపం ధరించిందా అన్నట్టుంది. సాదా తెల్లచీరె, తెల్లరవిక తొడిగి, జారు ముడివేసి విధవ రూపంలో కన్పించిన సుగుణను చూసిన పద్మావతికి లోకమంతా శూన్యంగా తోచింది. 'అంత చలాకీగా, చిలిపిగా ఉండే సుగుణేనా ఇది' అన్పించింది. కళ్లలో నీళ్లు చిందాయి. ఒకటి రెండు కన్నీటిబొట్లు రాలి సుగుణ చేతిమీద కూడా పడ్డాయి.

''నా ఖర్మకు నువ్వు ఏడుస్తావు దేనికే'' అన్నది సుగుణ చాల నిర్లిప్తంగా.

ఈ ఖర్మ సిద్ధాంతం గురించి పద్మావతి ఎన్నడూ హెచ్చుగా ఆలోచించి ఉండలేదు. అయినా సుగుణ వచ్చిన నాలుగోనాడు మాత్రం ''అయితే సుగుణా ! ఖర్మ అనుకుంటూ ఇలా బ్రతుకంతా బండలు చేసుకోడమేనా, మరేమైనా మార్గం ఉన్నదా'' అంది. సుగుణ ఏమీ సమాధానం చెప్పలేదు. ఎటో చూస్తూ కూర్చుంది.

''ఏమిటే ఆలోచిస్తున్నావ్'' అన్నది పద్మావతి రెట్టిస్తూ.

''ఏమీలేదు.''

''లేదు సరే ! ఇక ఇంతేనా అంటాను.''

''అంటే.''

''అంటే, నీ నూరేళ్ల బ్రతుకూ ఇలా అడివిన కాసిన వెన్నెల కావలసిందేనా. ఏ రెండేళ్లు కాపురం చేశావో. ఏం అనుభవించావ్.''

''నాకు అంతే రాసిఉంది. దానికేం చేస్తాం'' అన్నది సుగుణ వైరాగ్యంగా.

''ఈ వైరాగ్యానికేంలే. నీకేం పిల్లా పాపా ! మళ్లా పెళ్లిచేసుకోకూడదూ.''

పద్మావతి ఇంకా మాట పూర్తి చేసిందో లేదో, సుగుణ హఠాత్తుగా చలించిపోయి, రివ్వున పద్మావతి నోరు గట్టిగా చేత్తో మూసివేసింది.

''ఆమాట అనకు పద్మా—అటువంటిమాట ఇకముందెప్పుడూ పెదవిమీదకైనా రానీకు.''

సుగుణ చెయ్యి తప్పించుకుంటూ పద్మావతి అన్నది.'' అదేమిటే—అంత తప్పుమాట ఏమన్నాను.''

''నీకు తెలియదు పద్మా .... తప్పొప్పులమాట దేనికి. ఈ ప్రసక్తి ఇక ఆపివెయ్యి, నీకు పుణ్యం ఉంటుంది.''

''అంటే నాకు తెలియక అడుగుతాను—ఇలా జీవితమంతా ఉండిపోదామనే !''

సుగుణకు ఉన్నట్టుండి ఏదో ఆవేశం పూనింది. నిశ్చలంగా నిశ్చయంగా అన్నది. ''ఈ జీవితమే కాదు. అవసరమైతే ఏన్ని జీవితాలైనా ఇలాగే ఉంటాను పద్మా. నా హృదయంలో 'ఆయన' స్థానంలో మరెవరికీ చోటు లేదు. ఆయనతో ఉన్న ఆ రెండు సంవత్సరాల జీవితాన్నీ, ఆయన ప్రేమనూ తల్చుకుంటూ ఎన్ని జీవితాలైనా గడిపెయ్య

గలను. అంత నిర్మలంగా, పవిత్రంగా ఆయన ప్రేమించిన ఈ దేహాన్ని మరొకరికి యిచ్చి అపవిత్రం చేయమంటావా. అందులో తృప్తి ఉందంటావా .... ఏమో నాకు తెలీదు. నా జీవితాన్ని ఇలా గడిచిపోనీ. ఈ జీవితంలో నేను ప్రేమించిందల్లా ఆయన ఒకర్నే. ఆయన ఉన్నా, లేకపోయినా అందులో మార్పేమీ రాదు."

ఇన్ని మాటలు సుగుణ మాట్లాడేవరకూ అలాగే ఏదో మైకంలో ఉన్నట్టు నోరు తెరిచి వింటూ కూర్చుంది పద్మావతి. చివరకు సుగుణ కళ్లు ఒత్తుకుంటూ ఒకమూలకు ఒదిగి కూచున్నాక గానీ పద్మావతి ఈ లోకంలో పడలేదు. సుగుణ చెప్పినదంతా, ఏదో తన మనసుకి ఏమూలో తెలిసిన విషయమైనట్లుగానే ఉంది ఆమెకు. అయినా మళ్లీ ఏమీ తెలియనట్లుగానూ ఉంది.

ఇది జరిగాక మరో నాలుగు రోజులకు సుగుణ తిరిగి వెళ్లిపోయేవరకూ పద్మావతి సుగుణతో మామూలుగా కలసి మెలసి ఉండలేకపోయింది. సుగుణ వచ్చిన క్రొత్తలో తమ వీధిలోనే జరుగుతున్న హరికథాకాలక్షేపానికి రోజూ రాత్రి భక్తితో హాజరవుతూఉంటే పద్మావతి 'దీనికేదో పిచ్చి ఎక్కినట్టుంది' అనుకుంది. సుగుణను మళ్లీ మామూలుగా తేవాలని కూడా ప్రయత్నించింది. "హరికథల్లో ఏముందే—మన మనసుల్లో ఉండాలిగాని" అన్నది హరికథల నుండి, ఆ రకమైన ధోరణినుండి మరల్చాలని. సుగుణ వినలేదు. చివరకు "లౌడుస్పీకర్లు పెట్టి వీధిలో వాళ్ల నిద్రంతా చెడగొడ్తూంటే—ఇక్కడికి వినిపించనట్టు, అక్కడిదాకా నీవు పోవట మెందుకే—మహా బడాయిగాని" అని కూడ అన్నది. సుగుణ ఉడుక్కోలేదు. సమాధానమూ చెప్పలేదు. తన ధోరణి మాననూ లేదు. "వైరాగ్యం బాగానే తలకెక్కింది" అనుకుంది పద్మావతి అప్పుడు !—కాని ఇప్పుడు, ఇది జరిగాక ఇదంతా కేవలం వైరాగ్యమే కాదనీ, దానికి అతీతమైన ఒక అనుభూతిలో సుగుణ మునిగిపోయి ఉన్నదని పద్మావతికి అర్థమైంది. ఆ అనుభూతిలో త్యాగం, త్యాగంతోబాటు ఆనందం, నిశ్చలత, నిశ్చలతతోబాటు శాంతి ఉన్నట్టనిపించింది ఆమెకు. అటువంటి ఆనందంతో, శాంతితో సుగుణ తనకంటే ఎన్నోరెట్లు ఎదిగినట్లు, సుగుణ ముందు తనెంతో చిన్నదైనట్లు అన్పించసాగింది పద్మావతికి. ప్రతి క్షణమూ తనకూ, సుగుణకూ మధ్య అఘాధం పెరుగుతున్నట్లుగానే అన్పించింది. సుగుణ ఎదురైనప్పుడల్లా తనకు తెలియకుండానే తప్పుకు తప్పుకు తిరిగేది. ఎప్పుడూ పరధ్యానంగా మౌనంగా ఉండేది. మధ్యలో ఒకటి రెండు సార్లు మాధవరావు "ఏమిటి అట్లా దిగులుగా ఉంటున్నావ్" అని గూడా అన్నాడు—చిట్టచివరకు సుగుణ వెళ్లిపోయిన రోజున ఆమెకు శ్వాస ఆడినట్టయింది—స్వేచ్ఛగా వూపిరి పీల్చుకున్నట్లయింది!

ఆ రాత్రి పద్మావతి మాధవరావు గదిలో పడుకుంది. సుగుణ ఉన్నన్నినాళ్లూ సుగుణతోబాటు హాలులోనే పడుకుంటోంది. ఇవాళ పడుకోబోయేముందు మాధవరావు లౌడ్ స్పీకర్ల మీద చిరాకు పడ్డాడు. "ఈ లౌడ్‌స్పీకర్లు వచ్చి ప్రాణాలు తీస్తున్నాయి. ఈ గోలలో ఎట్లా నిద్రపట్టేట్లు" అన్నాడు రెండిళ్లవతల ఏర్పాటైన హరికథాకాలక్షేపం లౌడ్ స్పీకర్లద్వారా చేస్తున్న శబ్దాన్ని ఉద్దేశించి. వినుక్కోవటమైతే చేశాడుగానీ, లౌడ్‌స్పీకర్లుగానీ, హరికథాకాలక్షేపం గానీ అతని నిద్రనేమీ నిరోధించలేక పోయాయి. పడుకోగానే పద్మావతిని దగ్గరకు తీసుకొని హృదయానికి హత్తుకున్నాడు—అలాగే రెండు నిమిషాల్లో నిద్రపోయాడు.

నిద్రపట్టనిదల్లా పద్మావతికే ! కారణం హరికథాకాలక్షేపమే కాదు ! .... ఆమెకు ఒకటే ఆలోచనలు పట్టుకున్నవి —సుగుణ గురించీ, అప్పుడప్పుడూ రవణ గురించీ. మాధవరావు వంక చూసింది. నిర్మలంగా పసిపిల్లవాడిలా నిద్రపోతున్నాడు. ఆ ముఖంలోని నిష్కపటానికి ఆమె మనసు ముగ్ధమైంది. ఆ ముఖాన్ని తను ఎప్పుడూ అలాగే చూస్తూ ఉండాలనీ, తనూ చూస్తూ ఉండగానే కాలం నిల్చిపోవాలనీ అన్పించింది ఆమెకు ...... అతని నుదుటి నుంచి రెండు స్వేద బిందువులు చిన్నగా క్రిందికి జారుతున్నాయి. పద్మావతికి వాటిని తుడవాలనిపించింది. చేతిలోకి చీరకొంగు తీసుకుంది... అంతే ! హఠాత్తుగా ఆమె కళ్లముందర ఒక దృశ్యం వచ్చి నిల్చింది. అది తన మొదటి భర్త జీవించి ఉన్ననాటి దృశ్యం. ప్రతి రాత్రీ అలసి నిద్రిస్తున్నప్పుడు 'ఆయన' కూయిలాగే నుదుటిపైన చెమట పట్టేది—తన పమిటతో తుడిచేది ! ఈ దృశ్యం స్మరణకు రాగానే కుదించుకుపోయింది పద్మావతి. చేతిలోని పమిట దానంతట అదే జారిపోయింది—ఇక మాధవరావు ముఖం చూస్తూ పడుకోలేకనూ పోయింది.

అతని హస్తం ఆమె వక్షంపైకి సాగివుంది— చిన్నగా ఆ చేతిని తొలగించి పద్మావతి పక్కకు ఒత్తిగిలి పడుకుంది !

లౌడ్ స్పీకర్లనుండి వస్తోన్న హరికథ చెవుల్లో హోరుపెడుతోంది. అంతకుమించిన హోరు ఆమె హృదయంలో ! కథకుడు యెవరో సలక్షణంగా చెబుతున్నాడు హరికథ, మహాపతివ్రత సతీసుమతి అమర చరిత్రఅది. భర్త కుష్టురోగ పీడితుడైతే, అతణ్ణి మోసుకుని వేశ్యగృహానికి తీసుకువెళ్లిన మహాసాధ్వి సతీ సుమతి దివ్యకథనం అది. ఆ భర్తకోసం సూర్యదేవునే శాశించ గలిగిన మహాశక్తిని తనప్రాతివ్రత్య ప్రభావంతో ప్రదర్శించిన అద్వితీయ ఘట్టంఅది. అటువంటి సాధ్వీమణులైన సుమతి, సీత, సావిత్రి, అనసూయ, తదితరులు జన్మించి స్త్రీ ధర్మానికి మార్గదర్శకత్వం వహించిన పునీత భారతభూమి మనది' అంటున్నాడు కథకుడు.

పద్మావతి ఇక వినలేకపోయింది. చెవుల్లో వేళ్లుకుక్కుకుని నిశ్శబ్దంగా యేడ్చింది. రవణచావు, సుగుణ ప్రభావం, సుమతి కథనం — అన్నీకలసి ఆమె మనసులో ఒక మహాతుఫాను రేపాయి. తలలో బ్రహ్మాండాన్ని బ్రద్దలు చేశాయి .... ఆ క్షణాన, ఒకే శయ్యమీద తనప్రక్కనే పడుకునివున్న మాధవరావు, యెవరో పరపురుషుడుగాను — చచ్చి స్వర్గానవున్న తన భర్తకు తాను ద్రోహం చేస్తున్నట్లుగానూ అన్పించింది ఆమెకు!!

నిశ్శబ్దంగా మంచందిగి చాపవేసుకుని ఆ రాత్రంతా కన్నీరు మున్నీరుగా యేడుస్తూ గడపివేసింది — యేడుస్తున్న కారణం యేమిటో తనకే స్పష్టంగా తెలియకుండా !

## 3

మర్నాడు ఇంకా తెల్లవారకముందే మూర్తి వచ్చి వాలాడు. మూర్తి వస్తే ఇల్లంతా సందడే. స్నేహితులమధ్య మాటలకు అంతంటూ వుండదు. కాఫీ ఫలహారాలయాక వంటింట్లో పని చూసుకుంటోంది పద్మావతి. హాల్లో మిత్రులిద్దరూ యెడతెగని విషయాలమీద ఒకటేమాటలు ! అంతర్జాతీయ రాజకీయాలు మొదలు, సంఘసంస్కరణల వరకూ యేదీ తప్పిపోకూడదు. మూర్తికి సంభాషణా చాతుర్యం హెచ్చు. పద్మావతి వింటూ పని చూచుకుంటోంది. సంభాషణ తిరిగి తిరిగి స్త్రీ పునర్వివాహం మీద వాలింది.

"నీ సిద్ధాంతం, చాదస్తం యెంతదూరం వచ్చాయిరా" అంటున్నాడు మాధవరావు.

"ఒరేయ్, నువ్వు యేమైనాచెప్పు, నన్నడిగితే మన సమాజం స్త్రీ పునర్వివాహానికి ఇంకా పూర్తిగా తయారు కాలేదంటాను. ఒకభర్తతో కొన్నాళ్లు కాపురంచేసి విధవైన స్త్రీ అయితే మరీనూ ! ఆడది మళ్లా పెళ్లాడటం తప్పనికాదు నాభావం. కాని ఒకభర్తతో సంసారం చేసిన స్త్రీ, మరొక భర్తకు భార్యగా పరిపూర్ణ హృదయంతో అతికిపోవటానికి మన సంస్కృతి నుండి ఆమెపొందిన శిక్షణ అడ్డువస్తుంది. ఆ సంస్కృతీ ప్రభావంలోనే వున్న మననేటి సమాజమూ అడ్డువస్తుంది. సమాజ విలువలూ, సహజ జీవనానికి ఆమెకూ అడ్డునిలుస్తాయి. యీ స్థితిలో అటువంటి స్త్రీ తానూ మనశ్శాంతితో సుఖించలేదు. తను చేసుకున్నవాడినీ సుఖపెట్టలేదు. కనుక, నా వుద్దేశం; ముందు జరగవలసింది సమాజ దృక్పథమూ విలువలూ మారటం, స్త్రీ ధర్మాలపట్ల స్త్రీలకు మన సంస్కృతియిచ్చే శిక్షణలో మార్పురావటం — యేమంటావ్"

ఈ వాక్కులు శ్రద్ధగావిన్న పద్మావతికి తర్వాతిమాటలు ఇక తలకెక్కలేదు. మూర్తిఅన్న యీ మాటలే మళ్లీమళ్లీ ప్రతిధ్వనిస్తున్నాయి. వాటిలో యెంతో నిజమున్నదనిపించింది. తన మనసునేవిప్పి మూర్తి చెబుతున్నట్లుంది. తను తెలుసుకోలేకుండా ఇన్నాళ్లుగా తన మనసులో గజిబిజిగావున్న యదార్థాలనే విడమర్చి, స్పష్టమైన రూపంయిచ్చి, మూర్తి చెబుతున్నాడా అనిపించింది ..... యీ యోచనల్లో కూరకుమారు వేలు తెగ కోసుకుని 'కెవ్వు' మంది వంటిట్లోంచి !

ఈ కేకకు హడలిపోయి మిత్రులిద్దరూ పరుగెత్తుకు వచ్చారు. మాధవరావు పద్మావతిని పొదివి పట్టుకుని "యేమిటది పద్మా, యేమిటి" అంటున్నాడు ఆమెకళ్లలోకి గాభరాగా చూస్తూ.

పద్మావతి కళ్లు యెర్రగా వున్నాయి. రాత్రంతాయేడ్చి యేడ్చి ముఖం వుబ్బివుంది. కన్నీటి చారల ఛాయలు ఇంకా పూర్తిగా మాయ మవలేదు — ఇట్లావున్న పద్మావతినిచూచి మాధవరావు వణకి పోయాడు. మూర్తి వచ్చిన సందడిలో ఉదయం నుంచీ అతను పద్మావతిని పట్టించుకోలేదు. అందుకు ఇప్పుడు తన్నుతాను నిందించుకుంటూ .... "ఏమిటి పద్మా, యెందుకు ఇట్లాయేడ్చావు, యేం జరిగింది. ఎవరేమి అన్నారు. అసలు యేమిటిదంతా పద్మా— నాతోచెప్పు" అంటున్నాడు ఆందోళనతో, బాధతో. ఆ కంఠంలోని ప్రేమకూ ఆపేక్షకూ, ఆ మొఖంలోని ఆత్రానికీ పద్మావతి ద్రవించి పోయింది. ఆమెకు పొంగిపొంగి దుఃఖం వస్తోంది — ఆమెస్థితిచూసి మాధవరావుకు దాదాపు యేడుపుపర్యంత మవుతోంది.

"మాట్లాడవేమి పద్మా. నావల్ల లోపమేమైనా జరిగిందా — పోనీ జరిగితే క్షమించు. నిన్ను ప్రతిమాలుకుంటున్నాను." —మాధవరావు !

ఇక భరించలేకపోయింది ఆమె. కట్టలు తెంచుకుని పొర్లి వచ్చిన దుఃఖావేశంతో యేడుస్తూ అతనివక్షంపై వాలిపోయి, తనచేత్తో అతన్ని వారిస్తూ— "అంతమాట అనకండి. మీరు దేవుడిలాంటివారు. మీవల్ల లోపమా ! నేనే పాపిష్టిదాన్ని. నేనే మిమ్మల్ని సుఖపెట్టలేక పోయాను. నా వల్లే లోపం జరిగింది. నన్నునేను తెలుసుకోలేక నేనే పొరపాటు చేశాను — పొరపాటంతా నాదే —" అంటోంది మధ్యమధ్య వెక్కుతో.

మూర్తి మాధవరావువంక చూశాడు. మాధవరావు మూర్తివంక చూశాడు. ఇద్దరిలో యే ఒక్కరికీ యేమీ అర్థం కాలేదు ! !

## 4

ఇది జరిగిన నాలుగో నెలలో ఆడపిల్లను ప్రసవించి, ఆ పిల్లను మాధవరావు చేతుల్లో వుంచి, శాశ్వతంగా కన్ను మూసింది పద్మావతి.

మాధవరావు మళ్లీ పెళ్లి చేసుకోలేదు. పద్మావతి మరణంతో తిరిగి అతనివద్ద చేరిన తలిదండ్రులూ, బంధువులూ, అందరూ ఎన్నెన్ని విధాలుగానో చెప్పారు మళ్లీ పెళ్లాడమని. చివరకు మూర్తి వచ్చి పట్టుపట్టాడు. తరచగా, తరచగా తన ఆఖరి నిర్ణయ మన్నట్లుగా మాధవరావు అన్న మాటలు ఇవి :

"మూర్తీ—ఎందుకురా అనవసరంగా అవస్థ పడతావు. నా హృదయంలో పద్మకు తప్ప మరెవ్వరికీ స్థానంలేదు. జీవితంలో ప్రేమించేది ఒక్కసారే. అది జరిగిపోయింది. ఆమె ఉన్నా, పోయినా అందులో మార్పేమీ రాదు...... ఆమెతో పాటు నేనూ వెళ్లక పోవటానికి కారణం ఆమె అప్పగించి వెళ్లిన పాపే—ఇక నీ యీ ప్రయత్నం మానుకో."

ఈ మాటలు విన్నాక మూర్తి తిరుగేమీ సమాధానం చెప్పలేదు. ఒక దీర్ఘమైన నిట్టూర్పు మాత్రం విడిచాడు—

ఇక తన ప్రయత్నమూ మానుకున్నాడు !

---